aruhi
aruhi group
BBTV
BBTV TELUGU

www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
20-10-2026 సంపుటి:01 సంచిక:209 పేజీలు:08 వెల:₹5/-

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ NAMASTEY MAHAAPRABHA TGTEL/26/A0738 mahaaprabha.com Email : info@mahaaprabha.com

సింగపూర్‌లో పడిపోతున్న జననాల రేటు

- ం ప్రభుత్వమే రంగంలోకి.. ఉద్యోగుల కోసం డేటింగ్ యాప్
- ం గత ఏడాది 30 వేలలోపే జననాలు
- ం పెరుగుతున్న అవివాహితుల సంఖ్యతో ఆందోళన
- ం 21 నుంచి 35 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఫస్ట్ డేట్
- ం అభిరుచులు, జీవనశైలి ఆధారంగా జోడీల ఎంపిక
- ం ఇద్దరికీ నచ్చితే పెళ్లి దిశగా అడుగులు

03

సింగపూర్‌లో తగ్గుతున్న జననాల రేటును అరికట్టేందుకు ప్రభుత్వం వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. యువతీ యువకులు తమకు నచ్చిన జీవిత భాగస్వామిని ఎంచుకునేందుకు 'ఫస్ట్ డేట్' పేరుతో డేటింగ్ యాప్‌ను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న ప్రభుత్వ ఉద్యోగుల కోసం రూపొందించిన ఈ యాప్.. అభిరుచులు, ఆసక్తులు, జీవనశైలి ఆధారంగా తగిన జోడీని సూచించనుంది. 2025లో దేశంలో జననాల సంఖ్య 30 వేలలోపే నమోదవడంతో ఆందోళన చెందుతున్న ప్రభుత్వం.. యువత పరిచయాలు పెంచుకుని వివాహ బంధాల వైపు అడుగులు వేసేందుకు ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. అయితే ఈ ప్రయోగం వివాహాలు, జననాల రేటుపై ఎంతవరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.





పాఠకులకు , ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు

విజయదశమి
శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా
మంగళవారం మా
కార్యాలయానికి సెలవు.
బుధవారం సంచిక రాదు.
పునర్దర్శనం గురువారం



నవంబర్ చివరికల్లా కాఫర్‌డ్యామ్ నిర్మించాలి.

- ం ప్రభుత్వానికి తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్
- ం కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత
- ం ప్రాణహిత జలాలను మళ్లించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచన
- ం గడువులోగా నిర్మాణం చేపట్టకుంటే పంప్‌హౌస్ వద్ద ఆందోళన
- ం మేడిగడ్డను సాకుగా చూపి రైతులకు నష్టం చేయొద్దని హితవు
- ం కరువు పరిస్థితుల్లోనూ సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- ం సమస్యలకు పరిష్కారాలు చూపడమే తమ లక్ష్యమని వెల్లడి

కన్నెపల్లి, కాళేశ్వరం ప్రాజెక్టు, అక్టోబర్19(మహా ప్రభ) నవంబర్ నెలాఖరులోగా ప్రాణహిత జలాలను మళ్లించేందుకు కాఫర్‌డ్యామ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను ఆమె సందర్శించారు. నిర్దేశించిన గడువులోగా కాఫర్‌డ్యామ్ నిర్మాణం చేపట్టకపోతే పంప్‌హౌస్ వద్దే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కరువు పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని కూడా రైతులకు అందించడంలో ప్రభుత్వం

-మిగతా 3 లో

ఫ్యూచర్ సిటీకి ప్రత్యేక పోలీస్
కమిషనరేట్

ఇబ్రహీంపట్నంలో నూతన కమిషనరేట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

- ం వేదమంత్రాల నడుమ కమిషనర్ తరుణ్ జోషికి అభినందనలు
- ం శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యం
- ం 4,337 చదరపు కిలోమీటర్లకు పైగా కమిషనరేట్ పరిధి
- ం మూడు జోన్లలో 22 శాంతిభద్రతల పోలీస్ స్టేషన్లు
- ం ట్రాఫిక్ కోసం ప్రత్యేకంగా నాలుగు పోలీస్ స్టేషన్లు
- ం సైబర్ నేరాల నియంత్రణ, మహిళల భద్రతకు ప్రత్యేక విభాగాలు
- ం ఫ్యూచర్ సిటీ విస్తరణకు అనుగుణంగా పోలీసింగ్ బలోపేతం

హైదరాబాద్:అక్టోబర్19(మహా ప్రభ) రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. భవిష్యత్తులో వేగంగా అభివృద్ధి చెందనున్న పట్టణ, పారిశ్రామిక ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, నేరాల నియంత్రణకు ప్రత్యేక పోలీసు వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. కమిషనరేట్ ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషికి వేదమంత్రాల నడుమ శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి, కొత్త

-మిగతా 3 లో



సీజేపీ నేతల కస్టడీ పొడిగింపు



03

మణిపూర్‌లో మళ్లీ రక్తపాతం..

- ం నలుగురి మృతి, పలువురికి గాయాలు
- ం సంగీత కార్యక్రమం సందర్భంగా రాళ్లదాడి, కాల్పులు
- ం కాల్పుల్లో 24 ఏళ్ల యువకుడు మృతి
- ం ఖమెన్‌లోక్ కొండల్లో ముగ్గురు గ్రామస్థుల హత్య
- ం గిరిజన మిలిటెంట్లుగా అనుమానిస్తున్న వ్యక్తులపై ఆరోపణలు
- ం ముఖ్యమంత్రి నివాసం ఎదుట మృతదేహాలతో నిరసన
- ం ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసుల లాఠీచార్జ్
- ం బాష్పవాయువు ప్రయోగంతో ఇంఫాల్‌లో ఉద్రిక్తత



03

ప్రపంచంలోని అత్యంత టాప్-20
కాలుష్య నగరాల్లో 13 భారత్‌లోనే

- ం మూడో స్థానంలో ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్
- ం 198 ఏక్యూఐతో ఆందోళనకరంగా గాలి నాణ్యత
- ం నాలుగో స్థానంలో త్రిపుర రాజధాని అగర్తల
- ం పాలి, ముజఫర్‌నగర్, బుర్వాన్‌పూర్‌లోనూ అధిక కాలుష్యం
- ం ముంబైలో 167గా నమోదైన వాయు నాణ్యత సూచీ
- ం ప్రపంచంలో తొలి రెండు స్థానాల్లో ఇండోనేషియా నగరాలు
- ం టాప్-20లో లేకున్నా ఢిల్లీలోనూ ఆందోళనకర పరిస్థితులు



03

తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్

పొదుపు బాటలో ప్రభుత్వం!

- ం ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్
- ం ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల వాడకంపై ఆంక్షలు విధింపు
- ం పరిశ్రమలకు విద్యుత్ కోతలు ఉండవని స్పష్టం చేసిన సర్కార్
- ం తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, కార్యాచరణ
- ం హైదరాబాద్‌లో అక్రమ నీటి మోటార్లపై ప్రత్యేక డ్రైవ్



హైదరాబాద్, అక్టోబర్19(మహా ప్రభ) ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో విద్యుత్, నీటి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పొదుపు చర్యలపై దృష్టి సారించింది. విద్యుత్ ఉత్పత్తి, నీటి లభ్యతపై ఒత్తిడి పెరగకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ఆదేశించింది. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో

-మిగతా 3 లో



03

అమెరికాలోని ప్రతి బిడ్డకు
స్పేస్‌ఎక్స్ షేర్!

- ం వచ్చే ఏడాది పంపిణీ చేస్తానన్న ఎలాన్ మస్క్
- ం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ప్రకటన
- ం ఒక్కో షేరు విలువ సుమారు రూ.14 వేలు
- ం అమెరికాలో 7.20 కోట్ల మంది పిల్లలు ఉన్నట్లు అంచనా
- ం మొత్తం వాటాల విలువ రూ.లక్ష కోట్ల వరకు ఉండే అవకాశం
- ం ఎవరికి వర్తిస్తుంది? అర్హతలపై స్పష్టత కరువు
- ం షేర్ల బదిలీ, దరఖాస్తు విధానంపై వెల్లడి కాని వివరాలు
- ం పౌరసత్వం, వయోపరిమితిపై కొనసాగుతున్న సందేహాలు



కాంగ్రెస్ నేతలకు
లీగల్ నోటీసులు

- ం కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలపై..
- ం మహేశ్ గౌడ్, పొంగులేటి, వంశీకృష్ణకు బీఆర్ఎస్ నోటీసులు
- ం నోటీసులు జారీ చేసిన సోమ భరత్ కుమార్
- ం సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్
- ం తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని సూచన
- ం స్పందించకపోతే పరువు నష్టం సహా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబర్19(మహా ప్రభ) కొండపోచమ్మ సాగర్ నీటిని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఈ నోటీసులు పంపించింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌చార్జ్

-మిగతా 3 లో

బీజేపీ కుట్రపూరితంగా విపక్షాలను ఓట్లను తొలగిస్తున్నది : అఖిలేష్ యాదవ్



న్యూఢిల్లీ: అక్టోబర్19(మహా ప్రభ)
సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ బీజేపీ పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ కుట్రపూరితంగా ఓటర్ల జాబితాను తారుమారు చేస్తోందని, దొంగ ఓట్లను చేర్పించడంతోపాటు ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తోందని ఆయన విమర్శించారు. లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద పార్టీ కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అవకతవకలు గుర్తిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని అఖిలేష్ సూచించారు. మోసం, నిజాయతీ లేకపోవడాన్నే బీజేపీ తన బలంగా భావిస్తున్నదని, అందుకే ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని అఖిలేశ్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రకటించిన తర్వాత అఖిలేశ్ ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవలే వేల కోట్లు ఖర్చుపెట్టి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్తిచేసిన తర్వాత మళ్లీ ఇప్పుడు ఎస్= అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం బీజేపీకి అనుకూలంగా జాబితాను మార్చేందుకేనని ఆయన ఆరోపించారు.

అమెజాన్‌లో మళ్లీ ఉద్యోగాల కోత?

5 వేల మందిపై వేటు!



న్యూఢిల్లీ: అక్టోబర్19(మహా ప్రభ)
ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ మళ్లీ ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రతిపాదిత డెలివరీ ప్రొటెక్షన్ చట్టం అమల్లోకి వస్తే, సుమారు 5 వేల మంది డెలివరీ ఉద్యోగులను తొలగించడంతోపాటు 15 గోదాములను మూసివేయవచ్చని సమాచారం. గోదాముల మూసివేత వల్ల మరో 2 వేల మంది ఉద్యోగులపై ప్రభావం పడే అవకాశం ఉందని న్యూయార్క్ పోస్ట్ కథనం వెల్లడించింది. అయితే, ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం వెలువడలేదు.న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ మద్దతిస్తున్న ఈ బిల్లు ప్రకారం, ప్రస్తుతం 40 థర్డ్ పార్టీ కాంట్రాక్టర్ల ద్వారా పనిచేస్తున్న 5 వేల మందికిపైగా డెలివరీ సిబ్బందిని అమెజాన్ నేరుగా ఉద్యోగులుగా నియమించుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధన అమల్లోకి వస్తే తన డెలివరీ వ్యవస్థను మార్చుకోవాల్సి వస్తుందని, అందులో భాగంగా ఉద్యోగాల కోత, గోదాముల మూసివేత వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందని కథనం పేర్కొన్నది.

టన్నెల్ బోరింగ్ యంత్రాల ఎగుమతులపై చైనా ఆంక్షలు

భారత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం



బీజింగ్: అక్టోబర్19(మహా ప్రభ)
భారత్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రభావం చూపే కీలక యంత్రాల ఎగుమతులపై చైనా సోమవారం కొత్త ఆంక్షలు ప్రకటించింది. వీటిలో సొరంగాల తవ్వకానికి ఉపయోగించే టన్నెల్ బోరింగ్ యంత్రాలు కూడా ఉన్నాయి. జాతీయ భద్రత, ప్రయోజనాల పరిరక్షణ కోసమే ఈ నియంత్రణలు విధిస్తున్నట్టు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఆంక్షలు నవంబర్ 18 నుంచి అమల్లోకి రానున్నాయి.ఈ నిర్ణయం భారత్‌లో నిర్మాణంలో ఉన్న భూగర్భ మెట్రో రైలు మార్గాలు, హైస్పీడ్ రైల్వే లైన్లు, వివిధ ప్రాంతాల్లోని సొరంగాల నిర్మాణ ప్రాజెక్టులపై ప్రభావం చూపే అవకాశం ఉన్నది. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో చేపడుతున్న సొరంగాల నిర్మాణానికి అవసరమైన యంత్రాల లభ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. టీబీఎంల ఎగుమతులపై చైనా గత కొన్నేండ్లుగా భారత్‌కు ఆంక్షలు విధిస్తున్నది. కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో పనిచేసే వాకింగ్ ఎక్స్‌కవేటర్లు, ఎత్తైన పీఠభూమి ప్రాంతాల్లో ఉపయోగించే వెట్ షాట్‌క్రీట్ యంత్రాల ఎగుమతిపైనా చైనా ఆంక్షలు విధించింది.

టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసు.. ముగ్గురు నిందితుల అరెస్ట్

ముంబై/కోటా, అక్టోబర్19(మహా ప్రభ)



బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పులకు పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు సోమవారం రాజస్థాన్‌లోని కోటా రైల్వేస్టేషన్‌లో అరెస్ట్ చేశారు. నిందితులు ముంబై నుంచి నేపాల్‌కు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నట్టు గుర్తించారు. బీహార్‌లోని బెగుసరాయ్‌కి చెందిన రితిక్ అలియాస్ రోషన్, హర్యానాలోని సోనిపట్‌కు చెందిన రెహాన్ సహా ముగ్గురిని కోటా స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నట్టు కోటా ఎస్పీ తేజస్వినీ గౌతమ్ తెలిపారు.రెహాన్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్న అనిల్ పండిట్‌తో పరిచయం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అనిల్ పండిట్ ఈ దాడికి సంబంధించి మాట్లాడినట్టున్న ఓ ఆడియో క్లిప్ వైరల్‌గా మారింది

పారిస్‌లో 350 మందికిపైగా అరెస్టు..

- అల్లర్లను నియంత్రించలేకపోయామన్న మంత్రి

పారిస్ అక్టోబర్19(మహా ప్రభ)
ఫ్రాన్స్‌లో ఆదివారం జరిగిన విధ్వంసం .. ఆ దేశ చరిత్రలో చేదు గుర్తుగా మిగిలిపోయింది. అయితే పారిస్‌లో ఇప్పటి వరకు సుమారు 350 మంది నిరసనకారుల్ని అరెస్టు చేశారు. పారిస్‌తో పాటు ఇతర నగరాల్లో జరిగిన నిరసన ప్రదర్శన వేళ.. ఆందోళనకారుల్ని పోలీసులు నియంత్రించలేకపోయినట్లు హోంమంత్రి లారెంట్ నునేజ్ తెలిపారు. అల్లర్లు, హింసను అంచనా వేయలేకపోయినట్లు ఆయన చెప్పారు. ఆదివారం జరిగిన హింస నేపథ్యంలో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. కానీ మాక్రన్ ఆ రాజీనామాను అంగీకరించలేదని తెలిసింది.దేశవ్యాప్తంగా పాఠశాల్లో అద్వాన్న పరిస్థితులు ఉన్నాయని, పెరిగే ధరల వల్ల రోజువారీ బ్రతుకు జీవనం కఠినంగా సాగుతున్నట్లు గత కొన్ని రోజుల నుంచి ఫ్రాన్స్‌లో ఆందోళనలు జరుగుతున్నాయి. అయితే వారాంతం వేళ సుమారు అయిదున్నర లక్షల మంది వరకు భారీ నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చారు. ఫ్రాన్స్‌లోని ముఖ్యమైన నగరాల్లో ఆ ఆందోళనలు జరిగాయి. కొందరు నిరసనకారులు విధ్వంసానికి దిగారు. సుమారు 1500 షాపులను, వ్యాపార కేంద్రాలను లూటీ చేసి ధ్వంసం చేశారు. వాస్తవానికి సెప్టెంబర్‌లో విద్యా ప్రమాణాలు



పెంచాలని విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. స్కూల్ బిల్డింగ్‌లు క్షీణదశలో ఉన్నాయని, టీచర్ల కొరత ఉన్నట్లు విద్యార్థులు ఆరోపించారు. అన్ని నగరాలకు ఆ ఆందోళన పాకింది. కొన్ని చోట్ల హింసకు దారి తీసింది. అక్టోబర్ 5వ తేదీన జరిగిన నిరసనలో 15 ఏళ్ల విద్యార్థి చేయికి తీవ్రగాయమైంది. టీచర్లు, పెన్షనర్లు, వివిధ సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాయి. తొలుత ఆందోళనలు శాంతియుతంగా సాగాయి. కానీ ఆ తర్వాత కాస్త వేడెక్కాయి. మరోవైపు ఫ్రాన్స్‌లో దేశాధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరో ఆరు నెలల్లో కొత్త ప్రభుత్వం ఏర్పడనున్నది. వచ్చే మే నెలలో జరిగే ఎన్నికల కోసం ఫ్రాన్స్ వీధుల్లోనే ప్రచారం మొదలైనట్లు కొందరు ఆరోపిస్తున్నారు. కానీ ఆదివారం జరిగిన ఘటన పట్ల మంత్రి లారెంట్ నునేజ్ కారణం వెల్లడించే ప్రయత్నం చేశారు. హింసకు బాధ్యుడిగా భావిస్తూ రాజీనామా చేసినట్లు చెప్పారు. కానీ ఆ రాజీనామాను మాక్రన్ తిరస్కరించినట్లు ఎలిసీ ప్యాలెస్ వర్గాలు పేర్కొన్నాయి. సుమారు 2 లక్షల మంది వరకు నిరసనల్లో పాల్గొంటారని అంచనా వేశామని, కానీ ఆ సంఖ్య 5 లక్షలు దాటిందని నునేజ్ అన్నారు. తాము తీసుకున్న భద్రతా చర్యలు సరిపోలేదన్నారు. పారిస్, లియాన్, మారిసెల్లీలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయలేకపోయినట్లు ఆ నగరాల మేయర్లు తెలిపారు. లూటీలు ఎందుకు జరిగాయో అర్థం కావడం లేదని, సుమారు 30 నిమిషాల పాటు లూటీ జరుగుతుంటే పోలీసులు ఏమీ చేయలేకపోయినట్లు మేయర్లు ఆరోపించారు. సమస్య పరిష్కారానికి హైస్కూల్ విద్యార్థులతో మీటింగ్ నిర్వహించాలని మేయర్లు అభిప్రాయపడ్డారు. జనసమీకరణపై మారిసెల్లిలో ప్రస్తుతం తాత్కాలిక బ్యాన్ విధించారు.

అమెరికా భావి అధ్యక్షుడు మనకు శత్రువు కావచ్చు..

- భారత్ చిన్న దేశమేమీ కాదు : నెతన్యాహు

న్యూఢిల్లీ: అక్టోబర్19(మహా ప్రభ)
భవిష్యత్ అమెరికా అధ్యక్షుడు ఇజ్రాయెల్ కు శత్రువు కావచ్చునని ఆ దేశ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. ఈ తరుణంలో భారత్ , లాటిన్ అమెరికా వంటి బలమైన దేశాలతో పొత్తు పెట్టుకోవాలని నెతన్యాహు తన అధికారులకు పిలుపునిచ్చారు. స్థానిక మీడియా కథనాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. అక్టోబర్ 27న ఇజ్రాయెల్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.మీడియా కథనాల ప్రకారం.. మరో రెండేళ్లలో ఇజ్రాయెల్ పట్ల శత్రుభావంతో ఉండే వ్యక్తి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టవచ్చునని, వారు పురుషుడు లేదా మహిళ ఎవరైనా కావచ్చునని, మీరు దానిని ఎలా ఎదుర్కొంటారు..? అని అధికారులను ఉద్దేశించి నెతన్యాహు ప్రశ్నించారు. అగ్రరాజ్యంతో సంబంధాలు



ఎలా నిర్వహిస్తారని అడిగారు. అమెరికా విధానంలో సంభవించే పెద్ద మార్పుకు సిద్ధమవుతూ.. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న రోజుల్లోనే ఇజ్రాయెల్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. వచ్చే రెండేళ్లలోనే అమెరికా సాయంతో చేయగలిగినదంతా చేయాలని నెతన్యాహు అన్నారు. అదే సమయంలో భవిష్యత్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మరిన్ని దేశాలతో సంబంధాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కూటములను ఏర్పాటు చేసుకోవాలని, ఇప్పుడు తాను అదే పని చేస్తున్నానని అన్నారు. భారత్ చిన్న దేశమేమీ కాదని, అలాగే లాటిన్ అమెరికా, బ్రెజిల్‌లలో త్వరలో భారీ మార్పులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కూటముల సంఖ్యను విస్తరించుకోవాలని, విలువ పెంచే సామర్థ్యాలను వృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, దేశంలో ఎన్నికలకు ముందు ఇజ్రాయెల్ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన ప్రధాన ప్రత్యర్థి అయిన గాడి ఐసెన్‌కోట్ తప్పుబట్టారు. ఇతర దేశాల పేరు చెప్పి నెతన్యాహు ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

కుర్సియాంగ్ అడవుల్లో మరో నల్లజింక ప్రత్యక్షం..

పరవశించిన పర్యాటకులు..!

న్యూఢిల్లీ: అక్టోబర్19(మహా ప్రభ)
పశ్చిమబెంగాల్ లోని కుర్సియాంగ్ అడవుల్లో మరో నల్లజింక ప్రత్యక్షమైంది. ఈ ఏడాది జనవరిలో ఒక నల్లజింక కనపడి అబ్బురపర్చగా.. ఇప్పుడు మరో నల్లజింక దర్శనమిచ్చింది. దుర్గాపూజ సీజన్ కావడంతో ప్రస్తుతం పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్, కుర్సియాంగ్ ప్రాంతాలు పర్యటకులతో కళకళలాడుతున్నాయి. ఈ క్రమంలో ఓ పర్యాటకుడికి 'పర్వతాల రాణి' గా పేరున్న కుర్సియాంగ్‌లోని దట్టమైన అడవుల్లో అరుదైన దృశ్యం కనిపించింది.కుర్సియాంగ్ అడవుల్లో పైన్ చెట్లతో నిండిన 'డౌ హిల్' ఏరియాలో అత్యంత అరుదైన నల్లని జింక దర్శనమిచ్చింది. ఈ ఏడాది ప్రారంభంలో కూడా కుర్సియాంగ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ దేబేశ్ పాండే డౌ హిల్ ఏరియాలో ఇలాంటి జింకను మొదటిసారి గుర్తించి కెమెరాలో బంధించారు. తాజాగా అదే ప్రాంతంలో ట్రెక్కింగ్ చేస్తున్న ఒక టూరిస్ట్ మరో నల్ల జింకను చూశారు. ఓ టూరిస్ట్ బృందం ప్రకృతిని



ఆస్వాదిస్తూ 'డౌ హిల్' అడవుల్లో నడుస్తుండగా వారిలో ఒకరికి హఠాత్తుగా నల్లని రంగులో ఉన్న జింక కనిపించింది. ఆ అద్భుత దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయిన సదరు పర్యటకుడు వెంటనే దాని ఫొటోలను తీశాడు. జింక కనిపించిన సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న పర్యాటకులు అరుదైన నల్లజింకను చూస్తూ ఆనందంతో పరవశించిపోయారు. జన్యుపరమైన మార్పులవల్ల అత్యంత అరుదుగా కొన్ని జంతువుల శరీరంలో 'మెలనిన్' అనే వర్ణద్రవ్యం అధికమవుతుందని, దాంతో అవి నల్లగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. చిరుత శరీరంలో మెలనిన్ పెరిగి అది 'బ్లాక్ పాంథర్' గా మారినట్లే, 'బార్కింగ్ డీర్' జాతికి చెందిన జింకల్లో కూడా ఇలాంటి మార్పులు సంభవించి అవి పూర్తిగా నల్లగా కనిపిస్తాయి. ఇలాంటి అరుదైన జన్యుమార్పు పది లక్షల జంతువులలో ఒకదానికి మాత్రమే సంభవిస్తుంది. గతంలో అటవీ శాఖ నిర్వహించిన పరిశోధనల్లో కూడా ఇలాంటి నల్లని జింకల ఉనికి గురించి కనుగొన్నారు. అంతేకాకుండా ఇటీవలి సంవత్సరాలలో 'డౌ హిల్', 'బగోరా', 'మిరిక్' లోని విస్తారమైన కొండ ప్రాంతాలలో నల్లని చిరుత పులులు సంచరించినట్లు అనేకసార్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. అయితే పూర్తిగా నల్లగా ఉండే ఒక జింక ఈ విధంగా బహిరంగంగా సంచరించడం మునుపెన్నడూ జరగలేదు. వరుసగా నల్ల జింకలు కనిపించడంపై కుర్సియాంగ్ అటవీ విభాగం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ దేబేశ్ పాండే సంతోషం వ్యక్తంచేశారు. ఇది రాష్ట్ర అటవీ శాఖకు, వన్యప్రాణి ప్రేమికులందరికీ ఎంతో గర్వకారణమన్నారు. ఈ అడవులలో ఇంతకుముందు కూడా అరుదైన నల్ల జింకలు కనిపించినప్పటికీ, బహిరంగ ప్రదేశంలో ఒక నల్ల జింక కనిపించడం ఇదే మొదటిసారని అన్నారు.

జమ్ముకశ్మీర్ బస్సుపై రాళ్లతో దాడి..

- డ్రైవర్‌ను ఉగ్రవాదిగా పేర్కొన్న వ్యక్తులు

న్యూఢిల్లీ: అక్టోబర్19(మహా ప్రభ)
జమ్ముకశ్మీర్‌కు చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుపై ఇద్దరు వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. ఆ బస్సు డ్రైవర్‌ను ఉగ్రవాదిగా పేర్కొన్నారు. ఉగ్రవాద వాహనానికి నిప్పుపెడతామని, ప్రయాణికులను చంపుతామని వారు బెదిరించారు. ఈ దాడిలో బస్సు అద్దాలు ధ్వంసం కావడంతో ఒక ప్రయాణికుడు గాయపడ్డాడు. అక్టోబర్ 17న రాత్రి 10.30 గంటల సమయంలో ఢిల్లీ నుంచి శ్రీనగర్ వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ప్రయాణికుల భోజనం కోసం హర్యానాలోని కర్నాల్ జిల్లాలో ఒక ధాబా వద్ద ఆగింది.



అక్కడ ఒక కారు కూడా పార్క్ చేసి ఉన్నది.కాగా, ఆ కారులోని ఇద్దరు వ్యక్తులు, బస్సు ప్రయాణికుడి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్ రిజిస్ట్రేషన్ ఉన్న బస్సును ఉగ్రవాద వాహనంగా, డ్రైవర్‌ను ఉగ్రవాదిగా వారు పేర్కొన్నారు. 'ఈ ఉగ్రవాద వాహనాన్ని ఇక్కడి నుంచి తీసివేయండి' అని అరిచారు. ఆ బస్సు అక్కడి నుంచి వెళ్లిపోవాలని వారు డిమాండ్ చేశారు. అయితే బస్సు డ్రైవర్ ప్రశ్నించగా ఆ ఇద్దరు వ్యక్తులు మరింతగా రెచ్చిపోయారు. బస్సుపైకి రాళ్లు, ఇటుకలు విసిరారు. బస్సులోని వారిని కాల్చివేస్తామని, బస్సుకు నిప్పు పెడతామని, వారిని చంపేస్తామని బెదిరించారు. జమ్ముకశ్మీర్ రిజిస్ట్రేషన్ ఉన్న వాహనం హర్యానాలో ఉండటాన్ని మరికొందరు వ్యతిరేకించారు. ఈ రాళ్ల దాడిలో బస్సు కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. వృద్ధుడైన ఒక ప్రయాణికుడు గాయపడ్డాడు. ఈ సంఘటన తర్వాత ఆ బస్సు అక్కడి నుంచి బయలుదేరింది.

నవంబర్ చివరికల్లా కాఫర్‌డ్యామ్ నిర్మించాలి.

మొదటి తరువాయి

విఫలమైందని కవిత విమర్శించారు. మేడిగడ్డను చూపిస్తూ రైతులకు నష్టం కలిగించవద్దని ప్రభుత్వానికి సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రాణహిత జలాలను వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. తమ పార్టీ కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడానికే పరిమితం కాలేదని, సమస్యలకు పరిష్కార మార్గాలను కూడా సూచిస్తోందని కవిత తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, టెలివిజన్ తెరలపై కనిపించడమే తమ ఉద్దేశం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ సూచనలను పరిగణనలోకి తీసుకుని రైతులకు సాగునీరు అందించే విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

మణిపూర్‌లో మళ్లీ రక్తపాతం..

-నలుగురి మృతి, పలువురికి గాయాలు
-సంగీత కార్యక్రమం సందర్భంగా రాళ్లదాడి, కాల్పులు
-కాల్పుల్లో 24 ఏళ్ల యువకుడు మృతి
-ఖమెన్‌లోక్ కొండల్లో ముగ్గురు గ్రామస్థుల హత్య
-గిరిజన మిలిటెంట్లుగా అనుమానిస్తున్న వ్యక్తులపై ఆరోపణలు
- ముఖ్యమంత్రి నివాసం ఎదుట మృతదేహాలతో నిరసన
-ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసుల లాఠీచార్జ్
--బాష్పవాయువు ప్రయోగంతో ఇంఫాల్‌లో ఉద్రిక్తత



ఇంఫాల్, అక్టోబర్ 19:
తాజా హింసాత్మక ఘటనలతో మణిపూర్‌లో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారింది. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఈ హత్యలపై ఆగ్రహించిన స్థానికులు నిరసనలకు దిగడంతో ఇంఫాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు రెండు మృతదేహాలను ముఖ్యమంత్రి నివాసం ఎదుట ఉంచగా, అధికారులు వాటిని అక్కడి నుంచి తొలగించారు. మొదటి ఘటన మైతీలు, పాంగల్ ముస్లింలు నివసించే ప్రాంతంలో జరిగిన సంగీత కార్యక్రమం సందర్భంగా చోటుచేసుకుంది. ఈ సమయంలో రాళ్లదాడి, కాల్పులు జరగడంతో పలువురు గాయపడ్డారు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన 24 ఏళ్ల యువకుడు చికిత్స పొందుతూ మరణించాడు. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖమెన్‌లోక్‌లో మరో ఘటన జరిగింది. సమీపంలోని కొండల్లోకి కట్టెల కోసం వెళ్లిన ముగ్గురు గ్రామస్థులను గిరిజన మిలిటెంట్లుగా అనుమానిస్తున్న వ్యక్తులు కాల్చి చంపినట్లు సమాచారం. ఈ దాడిలో మరో ముగ్గురు గాయపడ్డారు. ఆ ప్రాంతంలో కుకీ మిలిటెంట్ గ్రూపు ఉనికి ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. వరుస హత్యలతో ఆగ్రహించిన గ్రామస్థులు మృతదేహాలను తీసుకుని ఇంఫాల్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్నారు. లోపలకు చొరబడి మృతదేహాలను అక్కడ ఉంచడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడంతో పాటు లాఠీచార్జ్ చేశారు. తాజా ఘటనలతో ఇంఫాల్ నగరంలో సాధారణ జనజీవనం స్తంభించినట్లు సమాచారం.

సీజేపీ నేతల కస్టడీ పొడిగింపు

21వ తేదీకి విచారణ వాయిదా



న్యూఢిల్లీ, అక్టోబర్ 19
కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నాయకులు ఆశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ జ్యుడీషియల్ కస్టడీని ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ మరో రెండు రోజులు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. వారి విడుదల కోసం సీజేపీ న్యాయబృందం పూచీకత్తులను సమర్పించిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. తదుపరి విచారణను ఈనెల 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. దాస్, రాంకాలను జ్యుడీషియల్ కస్టడీ నుంచి విడుదల చేయాలని కోరుతూ సీజేపీ న్యాయ బృందం స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు ఒక దరఖాస్తును దాఖలు చేసింది.వారిని నిర్బంధించిన రోజున వారి పూచీదారులు అందుబాటులో లేకపోవడంతో మొదట వారిని కస్టడీకి పంపారు. న్యాయబృందం ఇప్పుడు పూచీకత్తు పత్రాలను రికార్డులో దాఖలు చేసి వారి విడుదలను అభ్యర్థించింది. జంతర్ మంతర్‌ను నిర్దేశిత నిరసన ప్రదేశం జాబితా నుంచి తొలగించిన ఒక రోజు తర్వాత ఆ ప్రదేశంలోకి ప్రవేశించినందుకు ఢిల్లీ పోలీసులు దాస్, రాంకాలను ఈనెల 13న అదుపులోకి తీసుకుని 14న ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు.

కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

మొదటి తరువాయి

సోమ భరత్ కుమార్ వీటిని జారీ చేశారు.

కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు

కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ సెల్ పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే 'వెలుగు' దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు పంపించినట్లు తెలిపింది. అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణతో తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేసింది.

సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులను వెంటనే తొలగించాలి

తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ అంశానికి సంబంధించి చేసిన పోస్టులను వెంటనే బేషరతుగా తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేసింది.నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయ పరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది

అమెరికాలోని ప్రతి బిడ్డకు స్పేస్‌ఎక్స్ షేర్!



న్యూఢిల్లీ
ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ వచ్చే ఏడాది అమెరికాలోని ప్రతి బిడ్డకు తన రాకెట్ తయారీ సంస్థ స్పేస్‌ఎక్స్‌లో ఒక వాటాను బహుమతిగా ఇవ్వనున్నారు. తన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఈ విషయాన్ని సోమవారం మస్క్ ప్రకటించారు. స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన ఒక షేర్ విలువ 146 డాలర్లు అంటే సుమారు రూ. 14,000గా ఉంది. అమెరికాలో సుమారు 7.20 కోట్ల మంది పిల్లలు ఉన్నారు. తద్వారా పంపిణీ చేయాల్సిన వాటాల విలువ రూ. 1 లక్ష కోట్లు అవుతుంది. అయితే, దీనిని లక్షలాది మంది పిల్లలకు చేరవేసే ప్రక్రియ ఎలా ఉంటుందో తెలియదు. మస్క్ లేదా ఆయన కంపెనీ దీనిపై ఇప్పటివరకు ఎటువంటి సమాచారం అందించలేదు. అంతేగాక ఏ పిల్లలు ఇందుకు అర్హులు అవుతారో కూడా స్పష్టంగా తెలియదు. మస్క్ తన పోస్ట్‌లో అమెరికాలోని ప్రతి బిడ్డ గురించి ప్రస్తావించారు. అయితే దీనికి సంబంధించి కొన్ని పరిమితులు ఉన్నాయి.

సింగపూర్‌లో పడిపోతున్న జననాల రేటు

-ప్రభుత్వమే రంగంలోకి.. ఉద్యోగుల కోసం డేటింగ్ యాప్
-గత ఏడాది 30 వేలలోపే జననాలు
-పెరుగుతున్న అవివాహితుల సంఖ్యతో ఆందోళన
-21 నుంచి 35 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఫస్ట్ డేట్
-అభిరుచులు, జీవనశైలి ఆధారంగా జోడీల ఎంపిక
-ఇద్దరికీ నచ్చితే పెళ్లి దిశగా అడుగులు



న్యూఢిల్లీ,
జననాల రేటు తగ్గిపోతుండటంతో సింగపూర్ ప్రభుత్వం కొత్త ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. యువతీ యువకులు తమకు నచ్చిన జీవిత భాగస్వామిని వెతుక్కునేందుకు 'ఫస్ట్ డేట్' పేరిట ఓ డేటింగ్ యాప్‌ను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చినట్లు నివేదికలు వెల్లడించాయి. ప్రస్తుతం 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఈ యాప్‌ను రూపొందించినట్లు సమాచారం. వివాహంపై ఆసక్తి ఉన్నవారికి వారి అభిరుచులు, హాబీలు, జీవనశైలి ఆధారంగా సరైన జోడీని సూచించడం దీని ప్రధాన ఉద్దేశం.
నానాటికీ తగ్గుతున్న జననాలు
సింగపూర్‌లో జననాల రేటు తగ్గిపోవడం ప్రభుత్వానికి ఆందోళన కలిగిస్తోంది. 2025లో అక్కడ 30 వేల కంటే తక్కువ మంది పిల్లలు జన్మించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. జననాలు తగ్గడం, జనాభా వృద్ధాప్యం దిశగా సాగుతుండటం వంటి పరిణామాలు భవిష్యత్తులో జనాభా సమతుల్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యువత వివాహం, కుటుంబ జీవితం వైపు అడుగులు వేసేందుకు అనుకూల పరిస్థితులు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సాధారణ డేటింగ్ యాప్‌లకు భిన్నంగా ఫస్ట్ డేట్ పనిచేస్తుందని నివేదికలు చెబుతున్నాయి. ఒకేసారి పలువురితో పరిచయాలు పెంచుకునే అవకాశం కాకుండా, ఒక్కోసారి ఒకరితో మాత్రమే అనుసంధానమయ్యే విధానం ఇందులో ఉన్నట్లు సమాచారం. వినియోగదారుల అభిరుచులు, ఆసక్తులు, జీవనశైలిని పరిగణనలోకి తీసుకుని తగిన జోడీని సూచిస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వ డిజిటల్ గుర్తింపు వ్యవస్థ ద్వారా వినియోగదారులు తమ గుర్తింపును ధృవీకరించుకోవాల్సి ఉంటుంది.
ప్రభుత్వ ఉద్యోగులకే ఎందుకు?
ఈ యాప్ ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. 35 ఏళ్లు దాటినవారు, ప్రైవేటు రంగంలో పనిచేసేవారు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కాలేరా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ కార్యక్రమం ప్రస్తుతం ప్రయోగాత్మక దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో దీని పరిధిని విస్తరిస్తారా లేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. జీవిత భాగస్వామిని ఎంచుకోవడం వ్యక్తిగత నిర్ణయమైనప్పటికీ, జననాల రేటు తగ్గుతున్న నేపథ్యంలో యువతకు పరిచయ వేదికలు కల్పించేందుకు సింగపూర్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది. అయితే ఈ యాప్ ద్వారా ఎన్ని జంటలు ఏర్పడతాయి? వివాహాల సంఖ్య పెరుగుతుందా? జననాల రేటుపై ఏ మేరకు ప్రభావం చూపుతుంది? అన్నది వేచి చూడాలి. ప్రేమ, వివాహం వంటి వ్యక్తిగత అంశాల్లో ప్రభుత్వ చొరవ ఎంతవరకు ఫలిస్తుందనేది ఈ ప్రయోగం ద్వారా తేలుతుంది.

ఫ్యూచర్ సిటీకి ప్రత్యేక పోలీస్ కమిషనరేట్

మొదటి తరువాయి



బాధ్యతల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.
విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా ఏర్పాట్లు
ఫ్యూచర్ సిటీ పరిధిలో పట్టణీకరణ, పారిశ్రామిక కార్యకలాపాలు, నివాస ప్రాంతాలు విస్తరిస్తున్న నేపథ్యంలో పోలీస్ సేవలను బలోపేతం చేయడమే కొత్త కమిషనరేట్ ప్రధాన లక్ష్యం. శాంతిభద్రతల నిర్వహణతోపాటు నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. భవిష్యత్తులో పెట్టుబడులు, వ్యాపార కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉన్నందున సురక్షిత వాతావరణం కల్పించడంపై పోలీసు శాఖ దృష్టి పెట్టనుంది.
విస్తృత పరిధిలో పోలీస్ సేవలు
ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధి సుమారు 4,337.19 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంటరీ నియోజకవర్గాలకు సంబంధించిన ప్రాంతాలు దీని పరిధిలోకి వస్తాయి. మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల జోన్లుగా పోలీస్ పరిపాలనను విభజించారు. ఈ పరిధిలో 22 శాంతిభద్రతల పోలీస్ స్టేషన్లు, నాలుగు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు పనిచేయనున్నాయి. సైబర్ నేరాల నియంత్రణ, మహిళల భద్రత కోసం ప్రత్యేక విభాగాలు కూడా కీలకంగా వ్యవహరించనున్నాయి.
ప్రభుత్వ ఉత్తర్వులతో కొత్త కమిషనరేట్
తెలంగాణ ప్రభుత్వం 2025 డిసెంబరు 29న జారీ చేసిన హోంశాఖ జీవో నంబర్ 141 ద్వారా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ఏర్పాటు చేసినట్లు సమాచారం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధుల నుంచి కొన్ని ప్రాంతాలను వేరు చేసి కొత్త కమిషనరేట్‌లో చేర్చారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీస్ సేవలను విస్తరించడం, భద్రతా వ్యవస్థను సమన్వయం చేయడం ఈ ఏర్పాటులో ప్రధాన ఉద్దేశాలుగా ఉన్నాయి. 2030 నాటికి ఈ ప్రాంత జనాభా 25 నుంచి 30 లక్షలకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు.
ప్రజలకు సత్వర సేవలే లక్ష్యం
నూతన కమిషనరేట్ ద్వారా ప్రజలకు వేగంగా పోలీస్ సేవలు అందించడం, అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవడం, నేరాల నివారణకు నిఘాను పటిష్ఠం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం లభించనుంది. పోలీసు శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచి, ప్రాంత అభివృద్ధికి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నారు.
ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, పోలీసు శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్యేలు మాల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్‌గౌడ్, కాలే యాదయ్య తదితరులు హాజరయ్యారు.

ప్రపంచంలోని అత్యంత టాప్-20 కాలుష్య నగరాల్లో 13 భారత్‌లోనే

-మూడో స్థానంలో ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్
-198 ఏక్యూఐతో ఆందోళనకరంగా గాలి నాణ్యత
-నాలుగో స్థానంలో త్రిపుర రాజధాని అగర్తల
-పాలి, ముజఫర్‌నగర్, బుర్హాన్‌పూర్‌లోనూ అధిక కాలుష్యం
-ముంబైలో 167గా నమోదైన వాయు నాణ్యత సూచీ
- ప్రపంచంలో తొలి రెండు స్థానాల్లో ఇండోనేషియా నగరాలు
-టాప్-20లో లేకున్నా ఢిల్లీలోనూ ఆందోళనకర పరిస్థితులు



న్యూఢిల్లీ:
ప్రపంచంలో అత్యధిక వాయు కాలుష్యం నమోదవుతున్న టాప్-20 నగరాల్లో 13 భారతదేశానికి చెందినవి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అయితే, దేశ రాజధాని ఢిల్లీ మాత్రం ప్రపంచ టాప్-20 జాబితాలో లేకపోవడం విశేషం. అక్టోబర్ 19న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఐక్యూ డాట్ ఇన్ వెల్లడించిన గణాంకాల ప్రకారం ఈ వివరాలు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్ షహర్ ప్రపంచ వ్యాప్తంగా అత్యంత కాలుష్య నగరాల జాబితాలో 3వ స్థానంలో నిలిచింది. అక్కడ అమెరికా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 198గా నమోదైంది. ఇది ఆరోగ్యానికి హానికరమైన స్థాయి. త్రిపుర రాజధాని అగర్తల 181 ఏక్యూఐతో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. రాజస్థాన్ లోని పాలి, ఉత్తరప్రదేశ్ లోని ముజఫర్ నగర్, మధ్యప్రదేశ్ లోని బుర్హాన్ పూర్ నగరాల్లో ఎక్కువ స్థాయి 174గా నమోదైంది. హర్యానాలోని రోహతక్ లో 172, రాజస్థాన్ లోని కోటాలో 170, ముంబైలో 167, హాపూర్ లో 166, హిసార్, బికనీర్లలో 165, బరేలీలో 164 చొప్పున వాయు నాణ్యత సూచీ నమోదైంది. దీంతో ఈ నగరాలు ప్రపంచంలోని అత్యంత కాలుష్య ప్రాంతాల జాబితాలో చోటు సంపాదించాయి. ఇక, ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరంగా ఇండోనేషియా లోని పలాంగ్ కరాయ మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ ఎక్కువ 242గా నమోదైంది. ఇది తీవ్రమైన కాలుష్య స్థాయి. ఇండోనేషియాలోని పాలెంబాంగ్ 207తో రెండో స్థానంలో నిలిచింది. సంపిట్ (180) ఐదో స్థానంలో, జాంబీ (176) ఆరో స్థానంలో ఉన్నాయి. మలేషియాలోని పుత్రజయ, కౌలాలంపూర్, పెటాలింగ్ జయ నగరాలు కూడా టాప్-20లో నిలిచాయి. టాప్-20 కాలుష్య నగరాల జాబితాలో ఢిల్లీ లేకపోయినప్పటికీ, హస్తినలో వాయు కాలుష్యం ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతోంది. అక్టోబర్ 19 ఉదయం 7.31 గంటలకు ఢిల్లీలో ఏక్యూఐ గరిష్టంగా 191కి చేరినట్లు గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు అక్టోబర్ 18 సాయంత్రం 5.01 గంటలకు కనిష్టంగా 126గా నమోదైంది. అనంతరం కాలుష్య స్థాయి తగ్గుతూ అక్టోబర్ 19 మధ్యాహ్నానికి 130ల స్థాయికి చేరింది.

తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్

మొదటి తరువాయి

పగటి వేళల్లో అత్యవసరమైతే తప్ప ఏసీలను వినియోగించవద్దని, ఉపయోగించినప్పుడు 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్దే ఉంచాలని సూచించారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఏసీల వాడకాన్ని గణనీయంగా తగ్గించాలని ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో లేకున్నా వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరాయంగా సరఫరా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.
పరిశ్రమలకు ఎలాంటి విద్యుత్ కోతలు విధించడం లేదని, పారిశ్రామిక యాజమాన్యాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించింది.
ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పటిష్ఠమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంజయ్ జాజు తెలిపారు. ఈ అంశాలపై త్వరలో అఖిలపక్ష సమావేశం, కేబినెట్ ఉపసంఘం సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్థానిక నీటి వనరుల నుంచి వ్యవసాయ అవసరాల కోసం అక్రమంగా మోటార్ల ద్వారా నీటిని తోడటంతో విద్యుత్ లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయని ఇంధన శాఖ అధికారులు వివరించారు. మంజీరా, సింగూరు రిజర్వాయర్ల నుంచి నీటి లభ్యత తగ్గడంతో అక్కడి నుంచి అందాల్సిన 110 మిలియన్ గ్యాలన్ల నీటిని మిషన్ భగీరథ, కృష్ణా నది తదితర ప్రత్యామ్నాయ వనరుల ద్వారా సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపారు.
హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలకు తప్ప నిర్మాణాలు, ఇతర పనుల కోసం కొత్త బోర్లు తవ్వేందుకు అనుమతులు మంజూరు చేయవద్దని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ స్పష్టం చేశారు. మున్సిపల్ నల్లా కనెక్షన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడుతున్న వారిపై హైడ్రా సహకారంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
నవంబర్ 1 నుంచి నిర్మాణ అవసరాలకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన మురుగునీటిని సరఫరా చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గుతున్నాయని, తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలను అమలు చేస్తున్నామని మరో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు.

బచ్చురాజ్ పల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ ఆటపాటలతో మార్మోగిన గ్రామం

600 మందికి పైగా మహిళలు, గ్రామ ప్రజల పాల్గొనడం

గ్రామ సర్పంచ్ శైలజ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహణ







నిజాంపేట, మెదక్ జిల్లా: అక్టోబర్19(మహా ప్రభ)

నిజాంపేట మండలంలోని బచ్చురాజ్ పల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను గ్రామ సర్పంచ్ శైలజ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.

సద్దుల బతుకమ్మ సందర్భంగా గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉదయం నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మహిళలు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను మధ్యలో ఉంచి వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు.

పూల బతుకమ్మలతో పండుగ శోభ

బచ్చురాజ్ పల్లి గ్రామంలో ఎటుచూసినా రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు కనిపించాయి. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర వివిధ రకాల పూలతో మహిళలు అందంగా బతుకమ్మలను పేర్చారు. ఒక్కో బతుకమ్మను ప్రత్యేకంగా అలంకరించి తీసుకురావడంతో వేడుక ప్రాంగణం పూలతో కళకళలాడింది.

సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ, లయబద్ధంగా అడుగులు వేస్తూ ఆటలు ఆడటంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

బతుకమ్మ పాటలతో మార్మోగిన బచ్చురాజ్ పల్లి

బతుకమ్మ ఆటపాటలతో గ్రామం సందడిగా మారింది. మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలను సామూహికంగా ఆలపిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ పాటలను పెద్దలు పాడగా, యువతులు, చిన్నారులు వారితో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ చుట్టూ మహిళలు వలయాకారంలో నిలబడి పాటలకు అనుగుణంగా అడుగులు వేస్తూ ఆటలు ఆడడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల ఆటపాటలు, పూల బతుకమ్మల అందాలతో బచ్చురాజ్ పల్లి గ్రామం పండుగ శోభను సంతరించుకుంది.

600 మందికి పైగా పాల్గొని విజయవంతం

బచ్చురాజ్ పల్లిలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలకు 600 మందికి పైగా గ్రామ ప్రజలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో హాజరై బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బతుకమ్మలను తీసుకువచ్చి సామూహికంగా వేడుకలు నిర్వహించడంతో గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించింది. చిన్నారులు సైతం బతుకమ్మలను ఆసక్తిగా తిలకిస్తూ వేడుకల్లో భాగమయ్యారు.

గ్రామ సర్పంచ్ శైలజ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

సద్దుల బతుకమ్మ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామ సర్పంచ్ శైలజ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శైలజ శ్రీనివాస్ మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి మరియు సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. గ్రామంలో మహిళలందరూ ఒకచోట చేరి సద్దుల బతుకమ్మను ఆనందంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా సద్దుల బతుకమ్మ

సద్దుల బతుకమ్మ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, తెలంగాణ సంస్కృతి, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీక అని గ్రామ మహిళలు పేర్కొన్నారు. పూలను సేకరించి వాటితో బతుకమ్మను పేర్చడం, బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ ఆడడం ద్వారా మన పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. సద్దుల బతుకమ్మ రోజున మహిళలు పరస్పరం సద్దులు పంచుకోవడం, ఒకరినొకరు పలకరించుకోవడం, ఆనందాన్ని పంచుకోవడం ద్వారా ఆత్మీయతను చాటుకున్నారు. గ్రామంలోని మహిళలంతా కలిసి సామూహికంగా బతుకమ్మ ఆడటంతో పండుగ మరింత ప్రత్యేకంగా మారింది.

ఆడపడుచుల ఆటపాటలతో ప్రత్యేక ఆకర్షణ

బచ్చురాజ్ పల్లి గ్రామంలో జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఆడపడుచుల ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ వయసుల మహిళలు ఒకే వేదికపై కలిసి బతుకమ్మ ఆడటం అందరినీ ఆకట్టుకుంది.

పెద్దలు పాడిన సంప్రదాయ పాటలకు యువతులు, చిన్నారులు తోడవడంతో కార్యక్రమం మరింత ఉత్సాహభరితంగా సాగింది. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ మహిళలు పాటలు పాడుతూ చేసిన సందడి గ్రామ ప్రజలను ఆకట్టుకుంది.

ఘనంగా ముగిసిన సద్దుల బతుకమ్మ వేడుకలు

చివరగా మహిళలు తమ బతుకమ్మలను సామూహికంగా నిమజ్జనం చేసి సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా ముగించారు. గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. బచ్చురాజ్ పల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ సందర్భంగా కనిపించిన ఐక్యత, మహిళల ఉత్సాహం, సంప్రదాయ ఆటపాటలు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించాయి. గ్రామ సర్పంచ్ శైలజ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సద్దుల బతుకమ్మ వేడుకలు గ్రామ ప్రజలకు ఆనందాన్ని పంచుతూ ఘనంగా ముగిశాయి.











ప్రతి ఒక్కరూ దుర్గామాత అనుగ్రహం పొందాలి

-- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ అక్టోబర్19(మహా ప్రభ)
ప్రతి ఒక్కరూ దుర్గామాత అనుగ్రహాన్ని పొందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు.సోమవారం శ్రీశ్రీశ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దేవరకొండ పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ దుర్గామాతను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. శరన్నవరాత్రి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు దేశంలో ఎక్కడ ఉన్నా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగలను భక్తిశద్ధలతో ఘనంగా జరుపుకుంటారని రవీంద్ర కుమార్ అన్నారు. మన పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ పండుగల ద్వారా సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మిక భావనలను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని, సామాజిక ఐక్యతను చాటిచెబుతాయని తెలిపారు.అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు, నీల రవికుమార్, చిదెళ్ల వెంకటేశ్వర్లు, వాస వెంకటేశ్వర్లు, రమావత్ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందికి దసరా కానుకగా కొత్త బట్టల పంపిణీ

-సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా పంపిణీ





గాంధారి: అక్టోబర్ 19 (మహాప్రభ)
దసరా పండుగను పురస్కరించుకుని గాంధారి గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ మమ్మాయి రేణుక సంజీవ్ యాదవ్, ఉప సర్పంచ్ కామారెడ్డి భాస్కర్ గౌడ్, పాలక వర్గం ఆధ్వర్యంలో కొత్త బట్టలు పంపిణీ చేయడం జరిగింది.గ్రామ అభివృద్ధికి, పరిశుభ్రతకు అహర్నిశలు కృషి చేస్తున్న సిబ్బందిని గుర్తించి వారికి దసరా కానుకగా దుస్తులు అందించడం అభినందనీయమని సర్పంచ్ తెలిపారు. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని, వారి సంక్షేమానికి పంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉప సర్పంచ్ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రతి ఏటా దసరా, బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామ పంచాయతీ, పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫాం, కొత్త బట్టలు పంపిణీ చేస్తోంది. కార్మికుల గౌరవం పెంచేందుకు, పండుగను ఆనందంగా జరుపు కోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారు.అని పంచాయతీ సెక్రెటరీ నాగరాజ్, తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లైన్ రమేష్, వార్డ్ మెంబర్ నితిన్ పటేల్, మోచి శీను, గంగి రవి, ఇతర వార్డ్ మెంబర్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు





పెద్దవంగర, అక్టోబర్ 19 (మహాప్రభ)
మహబూబాబాద్ జిల్లా చిన్నవంగర గ్రామ సమీపంలోని వలిగొండ రహదారిపై చిన్నవంగర గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బోదపెల్లి నగేష్ (35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.స్థానికుల వివరాల ప్రకారం.. నగేష్ పొలం వద్ద గేదె పాలు పితికి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎల్బీ తండాకు చెందిన జాటోత్ సీతారాంకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితి తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఎస్సై ప్రమోద్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు నగేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

కన్కల్ గ్రామ ప్రజలకు విజయదశమి (దసరా) శుభాకాంక్షలు

చెడుపై మంచి విజయం సాధించిన విజయదశమి పండుగ



దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సంతోషాలు, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షిస్తూ.. కన్కల్ గ్రామ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. చెడుపై మంచి సాధించిన విజయానికి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. దుర్గామాత మహిషాసురుడిని సంహరించి ధర్మాన్ని నిలబెట్టిన రోజుగా, శ్రీరాముడు రావణాసురుడిపై విజయం సాధించిన శుభసందర్భంగా ఈ పండుగను ఎంతో వైభవంగా నిర్వహించుకుంటారు. దసరా అంటే కేవలం పండుగ మాత్రమే కాదు.. మనలోని చెడు ఆలోచనలను విడిచిపెట్టి, మంచి మార్గంలో పయనించాలనే సందేశాన్ని అందించే పవిత్రమైన సందర్భం. ప్రతి ఒక్కరూ ప్రేమ, ఆప్యాయత, ఐకమత్యం, మానవత్వం వంటి విలువలను జీవితంలో ఆచరిస్తూ ముందుకు సాగాలని ఈ పండుగ మనకు గుర్తుచేస్తుంది. ఈ విజయదశమి సందర్భంగా కన్కల్ గ్రామంలోని ప్రతి కుటుంబంలో ఆనందాలు వెల్లివిరియాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, సుఖశాంతులు వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలని, విద్యార్థులు విద్యలో రాణించాలని, పెద్దలు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తున్నాను. మన కన్కల్ గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ, కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో, పరస్పర సహకారంతో సోదరభావాన్ని చాటుకోవాలి. పండుగలు మన మధ్య ప్రేమానుబంధాలను పెంపొందిస్తూ, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని బలోపేతం చేయాలి. ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు, కొత్త ఆలోచనలు, నూతన విజయాలకు ఈ విజయదశమి నాంది కావాలి. చెడుపై మంచి విజయం సాధించిన విజయదశమి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడుస్తూ, సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు కృషి చేయాలని కోరుకుంటూ.. కన్కల్ గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలను అందించే విజయదశమి పండుగ శుభాకాంక్షలు!

ఇట్లు..
పుల్గం అఖిల్ రెడ్డి
స్టేట్ ఇంచార్జ్
నమస్తే మహాప్రభ

దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

-చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి
-దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



దేవరకొండ, అక్టోబర్ 19:(మహా ప్రభ)
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని, నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. విజయదశమి ధర్మం, న్యాయం, సత్యం సాధించిన విజయానికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయాన్ని చాటిచెప్పే ఈ పర్వదినం సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని కోరుకున్నారు. దసరా పండుగను యువత ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, అయితే వేడుకల సమయంలో అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే బాలునాయక్ సూచించారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. పండుగ సంబరాలు కుటుంబాల్లో విషాదాన్ని నింపకూడదని, క్షణికమైన నిర్లక్ష్యం విలువైన ప్రాణాలను బలిగొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు తీవ్ర విషాదానికి గురవుతున్నాయని, ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం జీవితాంతం తీరని వేదనను అనుభవించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించవద్దని, వాహన సామర్థ్యానికి మించి వేగంతో ప్రయాణించవద్దని తెలిపారు.
"మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తుంటుంది.. సురక్షితంగా ఇంటికి చేరడం కంటే గొప్ప పండుగ మరొకటి లేదు"అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మద్యం సేవించిన వారు వాహనం నడపకుండా ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలను వినియోగించుకోవాలని, స్నేహితులు, కుటుంబ సభ్యులు కూడా ప్రమాదకరమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించవద్దని సూచించారు.
దేవరకొండ నియోజకవర్గంలోని రైతులు, కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులు, వ్యాపారులు, పేదలు, బడుగు బలహీన వర్గాలు సహా అన్ని వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో సౌభాగ్యం నెలకొనాలని, ప్రజల మధ్య మతసామరస్యం, పరస్పర గౌరవం పెంపొందాలని పేర్కొన్నారు.
ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా దేవరకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, యువతకు మెరుగైన అవకాశాలు, మహిళల సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. ఈ విజయదశమి దేవరకొండ నియోజకవర్గ ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని, రైతులకు మంచి పంటలు పండాలని, యువతకు ఉజ్వల భవిష్యత్తు లభించాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ తమ కుటుంబాలతో ఆనందంగా గడపాలని కోరుతూ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

దేవరకద్ర నియోజకవర్గ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలే నా ధ్యేయం

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి
-అమిస్తాపూర్ సాక్షి గణపతి ఆలయంలో ఘనంగా దేవి శరన్నవరాత్రి వేడుకలు..
అమ్మవారిని దర్శించుకున్న మాజీ శాసనసభ్యులు



భూత్పూర్, అక్టోబర్ 19: మహాప్రభ
దేవరకద్ర నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలు వెల్లివిరిసేలా చూడాలని ఆ భవాని మాతను కోరుకున్నట్లు దేవరకద్ర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రసిద్ధ అమిస్తాపూర్ సాక్షి గణపతి దేవాలయంలో సోమవారం వైభవంగా జరుగుతున్న అమ్మవారి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో ముచ్చటించి, దసరా శరన్నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బల్సుపల్లిలో తాగునీరు, డ్రైనేజీ, వీధిలైట్ల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే జీఎంఆర్, మున్సిపల్ చైర్మన్‌కు
10వ వార్డు యువకుల వినతి





దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 19 మహాప్రభ
దేవరకద్ర: మున్సిపాలిటీలోని 10వ వార్డు బల్సుపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ యువకులు ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం దేవరకద్ర మున్సిపాలిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ వినతిని సమర్పించారు. గ్రామంలో గత 20 రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యువకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అలాగే డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయకపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. మూడు నెలలుగా వీధిలైట్లు సరిగా పనిచేయక రాత్రివేళల్లో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బల్సుపల్లి గ్రామ యువకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఎమ్మెల్యే జియంఆర్ భరోసా





-పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్, పుస్తకాల పంపిణీ

-ఆర్థిక ఇబ్బందులు చదువుకు అడ్డంకి కావొద్దు.. యువత లక్ష్యసాధనకు జియంఆర్ సేవా సమితి అండ

దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 19 మహాప్రభ

దేవరకద్ర: ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జియంఆర్) ముందుకొచ్చారు. జియంఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పోటీ పరీక్షల శిక్షణ శిబిరంలో కోచింగ్ పొందుతున్న అభ్యర్థులకు ఎమ్మెల్యే ఉచితంగా స్టడీ మెటీరియల్, పుస్తకాలను పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు పోటీ పరీక్షల సన్నద్ధతలో వెనుకబడకూడదన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దేవరకద్ర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సై, కానిస్టేబుల్ తదితర ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ, యువకులకు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేశారు. ఉచిత శిక్షణతో పాటు అభ్యర్థులకు అవసరమైన విద్యా సామగ్రిని సమకూర్చడం ద్వారా వారి సన్నద్ధతకు మరింత తోడ్పాటు అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

లక్ష్యంతో చదివితే విజయం సాధ్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. యువత కష్టపడి చదివి, క్రమశిక్షణతో సాధన చేస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. జీవితంలో అనుకున్నది సాధించాలంటే పట్టుదల, నిరంతర కృషి, సమయపాలన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత విలువైన సమయాన్ని వృథా చేయకుండా చదువుపై పూర్తి దృష్టి సారించాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించి కుటుంబాలకు గర్వకారణంగా నిలవడంతో పాటు సమాజంలో మంచి గుర్తింపు పొందాలని సూచించారు. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే దిశగా తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.

2016 నుంచి విద్యార్థులకు సేవలు

ఆర్థిక పరిస్థితులు ఏ విద్యార్థి చదువుకు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో 2016లో జియంఆర్ సేవా సమితిని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం, పేద విద్యార్థులను ప్రోత్సహించడం, వారు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు తోడ్పడటం, అభాగ్యులకు అండగా నిలవడం సమితి ప్రధాన ఉద్దేశమని వివరించారు. విద్యార్థులకు అవసరమైన సహాయం అందించడంతో పాటు దేవరకద్ర నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి తనవంతు కృషి కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

సివిల్స్ లక్ష్యం నుంచి న్యాయవాదిగా..

తన విద్యార్థి జీవిత అనుభవాలను గుర్తుచేసుకున్న ఎమ్మెల్యే జియంఆర్.. సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నట్లు తెలిపారు. కష్టపడి చదివి తొలి ప్రయత్నంలోనే ప్రిలిమ్స్‌లో అర్హత సాధించానని, అయితే మెయిన్స్‌కు సిద్ధమవుతున్న సమయంలో ఆరోగ్యం సహకరించకపోవడంతో పరీక్షలను సరిగా రాయలేకపోయానని పేర్కొన్నారు. ఆ తర్వాత న్యాయవిద్యపై దృష్టి సారించి, పట్టుదలతో చదివి న్యాయవాదిగా మారానని, నిరంతర కృషితో లీడింగ్ అడ్వకేట్‌గా ఎదిగానని తన అనుభవాన్ని పంచుకున్నారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే కష్టపడే తత్వం, పట్టుదల, నిరంతర ప్రయత్నం అవసరమని విద్యార్థులకు సూచించారు. ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికీ ఎదిగే అవకాశం కల్పించాలన్న సంకల్పంతో జియంఆర్ సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు

ఈ కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ కొండ దమయంతి, గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, ఎస్సై భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు కురువ బీరప్ప, రామంజి, భీమన్న తదితర అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్నినో ఏర్పడడానికి కారణం మనం కాదా---మంజుల పత్తిపాటి.

కరువుకు కారణం ఎవరు..?
చుట్టూ పచ్చదనాన్ని చిదిమేసి...
కొండలను కనుమరుగు చేసి...
ప్రకృతి ఒడిని బీడుగా మార్చి...
చెట్లను నరికి అడవులను మాయం చేసిన వారిది కాదా..?

కరువుకు కారణం ఎవరు..?
చెరువు కుంటలను మాయం చేసి కాంక్రీటు బిల్డింగ్స్ నిర్మాణం చేసిన వారిది కాదా..?

రేపటి మీద నమ్మకంతో బతికే మమ్మల్ని
ఎల్ నినో అనే పేరు పెట్టి
నడి వీధిలో నిలబెట్టింది ఎవరు..?

అరచేతిలో వైకుంఠం చూపించి,
రసాయన ఎరువులు అరువు ఇచ్చి...
అందలమెక్కిస్తామని మాయమాటలు చెప్పి...
రైతన్నలను అగాధంలోకి నెట్టింది ఎవరు..?

ఒక్కసారి ఆలోచించండి ...
కేవలం వాతావరణ మార్పు కాదు ఇది..!
మన అత్యాశకు ప్రకృతి ఇచ్చే హెచ్చరిక ఇది..!

బావి తరాలకు దాహం తీర్చే నీటి చుక్క కావాలి..!
ఊపిరి పోసే పచ్చని చెట్టు కావాలి..!

ఇకనైనా మేలుకొందాం ఒక్క మొక్క నాటుదాం..!
ఒక్క బొట్టు నీటిని ఒడిసి పడదాం..!

ప్రకృతితో స్నేహం చేద్దాం..!
అదే మనం ఎల్నినో ప్రశ్నకు మనమిచ్చే గొప్ప సమాధానం..!
దసరా పండుగ శుభాకాంక్షలతో మీ మంజుల పత్తిపాటి.

రచన: మంజుల పత్తిపాటి
చరవాణి 9347042218
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్.
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం.



తూప్రాన్ విద్యానగర్ కాలనీలో ఘనంగా పూల పండుగ వేడుకలు

-తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ సంబరాలు

-ఆటపాటలతో మార్మోగిన కాలనీ.. రంగురంగుల పూలతో కనువిందు చేసిన బతుకమ్మలు





తూప్రాన్ 19 అక్టోబర్ , (మహాప్రభ)

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా, ఆడపడుచుల ఆత్మీయతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు తూప్రాన్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఘనంగా జరిగాయి. తెలంగాణ పూల పండుగగా ప్రసిద్ధి చెందిన బతుకమ్మ సంబరాలను మహిళలు సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తూప్రాన్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని మహిళలు రంగురంగుల ప్రకృతి పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, మహిళల ఆటపాటలు, బతుకమ్మ పాటలతో విద్యానగర్ కాలనీలో పండుగ సందడి నెలకొంది. మహిళలంతా ఒక్కచోట చేరి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడి సంబరాలను అంబరాన్నంటేలా నిర్వహించారు.

ప్రకృతిని పూజించే అపురూపమైన పూల పండుగ బతుకమ్మ!

బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానానికి, ప్రకృతితో మమేకమైన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి పూజించడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకమైన విశిష్టతను చాటుతుంది. మహిళల ఐక్యత, కుటుంబాల మధ్య ఆత్మీయత, సమాజంలో సోదరభావాన్ని పెంపొందించే ఈ పండుగ తెలంగాణ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు మన సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పేలా విద్యానగర్ కాలనీ మహిళలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. రంగురంగుల పూల సోయగాలు, సంప్రదాయ పాటలు, మహిళల సందడితో విద్యానగర్ కాలనీ పండుగ శోభను సంతరించుకుంది.

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ.. ఆడపడుచుల ఆత్మీయతకు చిరునామా బతుకమ్మ.. ప్రకృతిని ఆరాధించే మన సంస్కృతికి మకుటాయమానం బతుకమ్మ!

బల్సుపల్లిలో తాగునీటి ఎద్దడి..
సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌కు గ్రామస్థుల వినతి



దేవరకద్ర: 19 అక్టోబర్ , (మహాప్రభ)

దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డు బల్సుపల్లి గ్రామంలో గత 20 రోజులుగా తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సమస్యతో పాటు వీధి దీపాలు వెలగకపోవడం, మురికి కాలువల నిర్వహణ సరిగా లేకపోవడం వంటి సమస్యలు కూడా గ్రామస్థులను వేధిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బల్సుపల్లి గ్రామ ప్రజలు సోమవారం మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. గత 20 రోజులుగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నామని, మురికి కాలువల సమస్యతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించడంతో పాటు వీధి దీపాలు, మురికి కాలువల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

నవరాత్రి ఉత్సవాల్లో సామూహిక దీపోత్సవం

-గండిమాసానిపేట్ దుర్గాభవాని మండపంలో మహిళల ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డి, అక్టోబర్ 19, (మహాప్రభ):



ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట్ శ్రీ దుర్గాభవాని మండపంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన మహిళల సామూహిక దీపోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపాల వెలుగులతో మండపం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహిళలు సామూహికంగా దీపాలు వెలిగించడంతో పాటు పుష్పార్చన, కుంకుమార్చనలో పాల్గొని భక్తిని చాటుకున్నారు. వేదపండితుడు రాజేశ్వర్ (రాజు) శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి విశేష అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సామూహిక దీపోత్సవంతో మండపంలో భక్తి వాతావరణం నెలకొంది.

నెహ్రూనగర్‌లో అంబరన్నంటిన సద్దులబతుకమ్మ సంబరాలు..





శేరిలింగంపల్లి, అక్టోబర్ 19 (మహాప్రభ):

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో సద్దులబతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అపార్ట్‌మెంట్లలోని మహిళలు, చిన్నారులు గంటల తరబడి బతుకమ్మ, కోలాటాలు ఆడి సంబరాల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా గునుగు, తంగేడు, తీరొక్క పూలతో పెద్ద బతుకమ్మలు తయారుచేసి పల్లెలకు దీటుగా భక్తి చాటుకున్నారు. నెహ్రూనగర్‌లోని శ్రీ రేణుకా అపార్ట్‌మెంట్‌లో దుర్గామాత చిత్రపటంతో గునుగు, బంతిపూలతో విశాలమైన బతుకమ్మను అలంకరించి భక్తిపారవశ్యం వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ యువజన నాయకులు చింతకింది రవీందర్‌గౌడ్, దేవులపల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... "ప్రకృతిని పూజించే తెలంగాణ ఆడపడుచుల పండగే బతుకమ్మ. ప్రపంచంలో ప్రకృతిని ప్రేమిస్తూ పూలను పూజించే గొప్ప సంస్కృతి మనకు దక్కడం గర్వకారణం. ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి, మన సంస్కృతి సంప్రదాయాల గొప్పతనానికి ప్రతీకగా బతుకమ్మ నిలుస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ పండగ అంతరించిపోకుండా రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అని అన్నారు. చిన్నారులు ఉత్సాహంగా కోలాటాలు ఆడి సంబరాల్లో పాల్గొన్నారు. సద్దులబతుకమ్మకు మహిళలు పూజలు చేసి గోపీనగర్ బతుకమ్మకుంటలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో డాకయ్యగౌడ్, రవి, ప్రవలిక, స్వాతి, మాధవి, సోనీ, లలిత తదితరులు పాల్గొన్నారు.

సూరజ్ భాన్ గార్డెన్‌లో ఘనంగా దుర్గాపూజ వేడుకలు



హైదరాబాద్, అక్టోబర్ 19 (మహాప్రభ):
: నవరాత్రుల సందర్భంగా దుర్గామాత పూజలను హైదరాబాద్‌లోని సూరజ్ భాన్ గార్డెన్‌లో సూరజ్ భాన్ కుటుంబం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు గార్డెన్ సహ యజమాని మనీష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గామాత పూజల్లో 1,000 మందికి పైగా భక్తులు పాల్గొని భక్తి భజనలు నిర్వహించినట్లు తెలిపారు. 1964లో స్థాపించిన ఈ గార్డెన్ హైదరాబాద్‌లోని పురాతన ద్రాక్ష తోటల్లో ఒకటిగా గుర్తింపు పొందిందని తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో అందరికీ ఆరోగ్యం, సంతోషం, శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. ఆరు దశాబ్దాల చారిత్రక వారసత్వం కలిగిన గార్డెన్‌లో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించడం తమ కుటుంబానికి ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఆత్మీయత చాటిన మహిళ

-బతుకమ్మలో మంత్రి శ్రీధర్ బాబు ఫోటో



రామగిరి, అక్టోబర్ 19 (మహాప్రభ):
కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్ కు చెందిన యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆయన సతీమణి సద్దుల బతుకమ్మ సందర్భంగా పేర్చిన బతుకమ్మలో తమ అభిమాన నాయకుడు శ్రీధర్ బాబు యొక్క ఫోటో పెట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు.యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అనుచరుడు జెమినీ గౌడ్ కుటుంబ సభ్యులు ఆదర్శనగర్ ప్రజలు వినూత్న రీతిలో శ్రీధర్ బాబు చిత్రపటాన్ని బతుకమ్మలో ప్రదర్శించి తమ అభిమానాన్ని చాటారు.రాబోయే రోజుల్లో ప్రజలకి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని,వారు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆదర్శ నగర్ దుర్గామాత మండపంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,మహిళలు పాల్గొన్నారు.

మానవత్వమే మా నాయకత్వం.. ప్రజాసేవే మా లక్ష్యం!

-మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



రామగిరి, అక్టోబర్ 19 (మహాప్రభ):
రామగిరి మండలం పన్నూర్ గ్రామానికి చెందిన చిందం శంకర్ భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో,వారు ఆసుపత్రి బిల్లులు,వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని పన్నూర్,రామగిరి మండల కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు మంజూరు చేయించి అందించడం జరిగింది.ఆపదలో ఉన్న కుటుంబాలకు, పార్టీ లకు అతీతంగా అండగా నిలుస్తూ,ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు కు,ఇందుకు కృషి చేసిన మంత్రి కార్యాలయ సిబ్బందికి,పన్నూరు,రామగిరి మండల కాంగ్రెస్ నాయకులకు భాధిత చిందం శంకర్ కుటుంబం కృతజ్ఞతలు తెలియజేసింది.

భవానీ స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన యం.డి మహబుబ్ ఖాన్



మల్లాపూర్ అక్టోబర్ 19 (మహాప్రభ):
: మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామములోని సోమవారం రోజున యం.డి మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో దుర్గ మాల ధరించిన భక్తులకు అన్నదా న కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా యం.డి మహబూబ్ ఖాన్ మాట్లాడుతూ అమ్మవారి దయ అందరి పై ఉండి గ్రామ ప్రజలందరూ సుబిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి అనంతరం అన్నధాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో మాజీ ఉప సర్పంచ్ ఎనర్ల రాములు, మండల కాంగ్రెస్ పార్టీ బి.సి సెల్ అధ్యక్షులు వర్ధ సురేష్, వార్డ్ సభ్యులు విజయ్ నేత, తిప్పని మునిందర్, భక్తులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు!





-పెద్ద చెరువు కట్టపై విరబూసిన రంగురంగుల పూల బతుకమ్మలు
-బతుకమ్మ పాటలతో మార్మోగిన పట్టణం..
-ఆడపడుచుల ఆటపాటలతో పండుగ శోభ
-సంప్రదాయబద్ధంగా బతుకమ్మల నిమజ్జనం..
-పోలీసుల పటిష్ట బందోబస్తు

తూప్రాన్, అక్టోబర్ 19.(మహాప్రభ)
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తూప్రాన్ పట్టణంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరుపుకున్నారు. సోమవారం నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు పట్టణంలో పండుగ శోభను సంతరించుకున్నాయి. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు, మహిళల కోలాటాలు, సంప్రదాయ బతుకమ్మ పాటలతో పట్టణమంతా సందడిగా మారింది. ముఖ్యంగా పెద్ద చెరువు కట్టపై జరిగిన వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
ఉదయం నుంచే మహిళలు తమ ఇళ్లలో వివిధ రకాల సీజనల్ పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో పేర్చిన బతుకమ్మలు పూల సోయగాలతో కనువిందు చేశాయి. కొత్త చీరలు ధరించి, సంప్రదాయ ఆభరణాలతో ముస్తాబైన ఆడపడుచులు తమ ఇళ్ల ముందు బతుకమ్మలను ఏర్పాటు చేసి, భక్తి భావంతో పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి బతుకమ్మలను తీసుకొని ఊరేగింపుగా పెద్ద చెరువు కట్టకు చేరుకున్నారు.
పూల పండుగకు పెద్ద చెరువు కట్ట వేదిక
పెద్ద చెరువు కట్టపై మహిళలు తమ బతుకమ్మలను వరుసగా ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతమంతా రంగురంగుల పూల వనంలా కనిపించింది. బతుకమ్మల చుట్టూ వలయాకారంగా చేరిన మహిళలు సంప్రదాయ పాటలను ఆలపిస్తూ లయబద్ధంగా అడుగులు వేస్తూ ఆడిపాడారు. ఒకవైపు బతుకమ్మ పాటల మధుర స్వరాలు, మరోవైపు మహిళల కేరింతలు, చప్పట్లతో పెద్ద చెరువు పరిసరాలు మార్మోగాయి.
చిన్నారులు, యువతులు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు ఒకచోట చేరి బతుకమ్మ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు, పూల ప్రాధాన్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంప్రదాయాలను మహిళలు ఘనంగా చాటిచెప్పారు.
సంప్రదాయబద్ధంగా బతుకమ్మల నిమజ్జనం
ఆటపాటల అనంతరం సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, బతుకమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బతుకమ్మలను తీసుకొని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. గంగమ్మ ఒడిలో బతుకమ్మలను సాగనంపుతూ తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు సద్దుల బతుకమ్మ వేడుకలతో ఘనంగా ముగింపు పలికారు.
పోలీసుల పటిష్ట బందోబస్తు
సద్దుల బతుకమ్మ వేడుకలకు మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. బతుకమ్మ నిమజ్జనానికి వెళ్లే ప్రధాన రహదారులు, చెరువు పరిసరాల్లో తూప్రాన్ సీఐ వెంకటరాజు గౌడ్, ఎస్ఐ గంగరాజు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రాకపోకలను పర్యవేక్షిస్తూ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.
ప్రముఖుల హాజరు
ఈ సద్దుల బతుకమ్మ వేడుకల్లో తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజినీ రవీందర్ గౌడ్, వైస్ చైర్‌పర్సన్ కొక్కొండ సమతా కాశిరెడ్డి, కౌన్సిలర్లు బొడ్డు రాధా శ్రీనివాస్, బొడ్డు జ్యోత్స్న వేణు, కుమ్మరి చెలిమెల రాములు, జైపాల్ రాథోడ్ నాయక్, సత్యలింగం, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, మహిళలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
సద్దుల బతుకమ్మ వేడుకలతో తూప్రాన్ పట్టణం పూల సౌందర్యంతో, సంప్రదాయ కళలతో, ఆడపడుచుల ఆనందోత్సాహాలతో కళకళలాడింది. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణలో బతుకమ్మ పండుగ ప్రత్యేకతను మరోసారి చాటిచెప్పింది.

అడవి అజిలాపూర్ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ యువ నాయకుడు ఆంజనేయులు ముదిరాజ్



దేవరకద్ర, అక్టోబర్ 19 (మహాప్రభ):
విజయానికి, ధర్మానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవరకద్ర మండలం అడవి అజిలాపూర్ గ్రామ ప్రజలకు కాంస్ యువ నాయకుడు గురకొండ ఆంజనేయులు ముదిరాజ్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో గ్రామంలోని ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని, ప్రతి ఒక్కరూ పరస్పర సహకారంతో గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.
చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీక అని ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మం, నిజాయతీ, మంచితనం చివరకు విజయాన్ని సాధిస్తాయనే సందేశాన్ని దసరా పండుగ అందిస్తుందని తెలిపారు. పండుగను ప్రజలందరూ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేత

- బచ్చు రాజుపల్లి సర్పంచ్ శైలజ శ్రీనివాస్



నిజాంపేట, అక్టోబర్ 19 (మహాప్రభ):
బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని బచ్చు రాజుపల్లి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు గ్రామ సర్పంచ్ శైలజ శ్రీనివాస్ నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రతను కాపాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమన్నారు. గ్రామ పరిశుభ్రత, అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పండుగల సందర్భంగా కార్మికులతో కలిసి ఆనందాన్ని పంచుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో కార్మికులు మరింత ఉత్సాహంగా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజశేఖర్, వార్డు సభ్యులు రమావత్ జైపాల్, గుర్రం ప్రశాంత్ గౌడ్, సుంచు స్వామి, గ్రామ నాయకులు నక్క స్వామి తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ మున్సిపాలిటీ 2వ వార్డులో కొలువుదీరిన దుర్గామాతను దర్శించుకున్న ఢిల్లీ రమేష్



దేవరకొండ అక్టోబర్ 19(మహా ప్రభ)
దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు మునర్కాపు కాలనీలో కొలువుదీరిన దుర్గామాతను ఢిల్లీ రమేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందుతూ, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, దేవరకొండ పట్టణం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ గోపి రాజు నవీన్ యశ్వంత్ పాటు దుర్గామాత యూత్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

దేవరకద్ర ప్రజల జీవితాల్లో దసరా వెలుగులు నిండాలి

-విజయదశమి వేళ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి శుభాకాంక్షలు



దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 19 మహా ప్రభ
దేవరకద్ర: విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవరకద్ర నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, సానుకూల ఆలోచనలు నింపాలని ఆల వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. దసరా పండుగ సందర్భంగా ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దేవరకద్ర నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరి జీవితాల్లో విజయాలు, సంతోషాలు వెల్లివిరియాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు.

నాని బ్లడీ రోమియో షూటింగ్ షురూ..

-ఇంతకీ లొకేషన్ ఎక్కడో తెలుసా..?



రీసెంట్‌గా శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో ప్యారడైజ్ మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు నాని. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. అక్టోబర్ 22న నెట్‌ఫ్లిక్స్‌లో కూడా సందడి చేయబోతుంది. కాగా ఇక తన నెక్ట్స్ మూవీ బ్లడీ రోమియో పై ఫోకస్ షిఫ్ట్ చేశాడు నాని. అభిమానులు, మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న షూటింగ్ టైం రానే వచ్చింది. ఫిలింనగర్ సర్కిల్ సమాచారం ప్రకారం దేశరాజధాని నగరం ఢిల్లీలో బ్లడీ రోమియో షూటింగ్ మొదలైంది. ఢిల్లీలో వారంపాటు ఈ తొలి షెడ్యూల్ కొనసాగనుందట. ఢిల్లీ షూటింగ్ తర్వాత నాని టీం నెక్ట్స్ షెడ్యూల్ కోసం హైదరాబాద్‌కు పయనం కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇదిలా ఉంటే ఇంతకీ నానితో రొమాన్స్ చేయబోయే భామ ఎవరనేది ఇంకా సస్పెన్స్‌లోనె పెట్టేశారు మేకర్స్.. నిహారికా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందిస్తున్నాడు. మేకర్స్ ఈ మూవీని 2027 వేసవి కానుకగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. నాని ఈ సారి సూపర్ స్టైలిష్‌గా కనిపించబోతున్నట్టు బ్లడీ రోమియో టీం ఇటీవలే రిలీజ్ చేసిన వీడియో ద్వారా క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. నాని ఇందులో గ్యాంగ్‌స్టర్ నుంచి చెఫ్‌గా మారిన వ్యక్తిగా కనిపించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. స్టైలిష్ హెయిర్ అండ్ బ్లాక్ గూగుల్స్ లో మేకోవర్ అయిన నాని లుక్‌తోపాటు సుజీత్ టీం పుడ్ ట్రక్‌పై.. దీశ్రీశీశీసఎ =శీఎవశీ..ఎష్ట్రవ ఖఱ్ఎష్ట్రవఅ ూజూవఅ ూశీశీఅ అని రాసిన వీడియోను షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది.

'జైలర్ 2' బాక్సాఫీస్ సునామీ..

-మూడు రోజుల్లోనే రూ.317 కోట్లకు పైగా వసూళ్లు!



సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' థియేటర్లలో భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటూ బాక్సాఫీస్ వద్ద రికార్డుల దిశగా సాగుతోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, కేవలం మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.317.15 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది.ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'జైలర్ 2' తొలి వారాంతంలోనే భారీ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ లెక్కలు చెబుతున్నాయి.ముఖ్యంగా తమిళనాడులో రజనీకాంత్‌కు ఉన్న క్రేజ్ ఈ సినిమాకు పెద్ద బలంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లోనూ సినిమాకు మంచి స్పందన లభిస్తుండటంతో పలు ప్రాంతాల్లో థియేటర్లు ప్రేక్షకులతో సందడిగా కనిపిస్తున్నాయి. అందుబాటులో ఉన్న వసూళ్ల అంచనాల ప్రకారం, మూడు రోజుల్లో భారతదేశంలో రూ.169.65 కోట్ల గ్రాస్, రూ.144.60 కోట్ల నెట్ వసూళ్లు నమోదయ్యాయి. విదేశీ మార్కెట్లలోనూ సినిమా మంచి ప్రదర్శన కనబరుస్తుండటంతో ప్రపంచవ్యాప్త వసూళ్లు రూ.317.15 కోట్లకు చేరినట్లు సమాచారం. శనివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 14,604 షోల ద్వారా 'జైలర్ 2' రూ.47.8 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రాంతాలవారీగా వసూళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు 7,802 షోల ద్వారా రూ.34.6 కోట్ల నెట్ వసూళ్లు, తెలుగు రాష్ట్రాలు 2,100 షోల ద్వారా రూ.8.50 కోట్ల నెట్ వసూళ్లు, ఉత్తర భారతదేశంలో 4,554 షోల ద్వారా రూ.4.25 కోట్ల నెట్ వసూళ్లు, కర్ణాటకలో కన్నడ వెర్షన్ ద్వారా 148 షోలతో రూ.45 లక్షల నెట్ వసూళ్లు సాధించినట్టు తెలుస్తుంది. ఈ లెక్కలను బట్టి తమిళనాడులో సినిమా ప్రభావం ఎంత బలంగా ఉందో అర్థమవుతోంది. తెలుగు రాష్ట్రాల్లోనూ గణనీయమైన వసూళ్లు నమోదవడం చిత్ర బృందానికి ఊరటనిచ్చే అంశం. భారతదేశంతో పాటు విదేశీ మార్కెట్లలోనూ 'జైలర్ 2' మంచి వసూళ్లు సాధిస్తున్నట్లు సమాచారం. అమెరికా, బ్రిటన్, గల్ఫ్ దేశాలు, ఆస్ట్రేలియా, మలేషియా వంటి ప్రాంతాల్లో సినిమాకు ఆదరణ లభిస్తోంది. మూడో రోజు ఒక్కరోజే విదేశాల్లో రూ.47.5 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చినట్లు ట్రేడ్ నివేదికలు పేర్కొంటున్నాయి.దీంతో ఇప్పటివరకు ఓవర్సీస్ మార్కెట్‌లో మొత్తం గ్రాస్ వసూళ్లు రూ.147.50 కోట్లకు చేరినట్లు అంచనా. భారతదేశంలో రూ.169.65 కోట్ల గ్రాస్ వసూళ్లు కలిపితే ప్రపంచవ్యాప్తంగా మొత్తం రూ.317.15 కోట్ల గ్రాస్ నమోదైనట్లు సమాచారం.



తస్సాదియ్యా అనుపమ చీరలో అదిరిందమ్మా.. కొత్త ఫొటోలు

హానెస్ట్‌గా తీసిన గ్లోబల్ సినిమా 'కల్ట్'



'మొదటి అయిదు నిమిషాలకే ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే సినిమా ఇది. ఇదో గ్లోబల్ కంటెంట్. అందుకే ఈ సినిమాను జపనీస్,స్పానిష్ భాషల్లో కూడా డబ్ చేశాం. ఇది భాషను దాటి వెళ్లే సినిమా. రెండు గంటల 20 నిమిషాల పాటు ఇంటెన్స్ డ్రామా ఉంటుంది. యాక్షన్ కంటే ఆడియన్స్ డ్రామాకు కనెక్టవుతారు. నేను ఎక్స్‌పెరిమెంట్ చేసిన ప్రతిసారీ ఆడియన్స్ కనెక్ట్ అయ్యారు. ఇందులో ఎలాంటి ఈక్వేషన్స్, క్యాలిక్యులేషన్స్ ఉండవు. చాలా హానెస్ట్‌గా ఈసినిమా చేశాం.ఇందులో 150మంది ప్రొఫెషనల్ యాక్టర్స్ ఉన్నారు. వారంతా కేవలం నా కోసం ఈ సినిమాలో భాగమయ్యారు. నటుడిగానే కాక, దర్శకునిగా కూడా నాకు సంతృప్తిని ఇచ్చిన సినిమా 'కల్ట్'' అని విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కల్ట్'. సందీప్ కాకరాల నిర్మాత. ఈ నెల 30న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడారు. ఇంకా నిర్మాత సందీప్ కాకరాల, యాక్టర్ ఈజీ, అనిరుధ్, కార్తికేయ, తారక్ పొన్నప్ప కూడా మాట్లాడారు. గోవాలోని ఒక నిర్మానుష్య ఐలాండ్ ఎస్టేట్‌లో 300మందికి పైగా చిక్కుకుపోవడంతో ట్రైలర్ మొదలైంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా ట్రైలర్ సాగింది. ట్రైలర్‌లో విశ్వక్ పాత్ర విభిన్న కోణాల్లో కనిపించింది. వాస్తవంగా జరిగిన భయానక సంఘటనల స్ఫూర్తితో రూపొందిన తొలి ఇండియన్ స్లాషర్ థ్రిల్లర్ ఇదని మేకర్స్ చెబుతున్నారు.

వచ్చే ఏడాది దీపావళికి 'స్పిరిట్'



పాన్ ఇండియా ప్రేక్షకులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'స్పిరిట్' ముందు వరుసలో ఉంటుంది. సాధారణంగా సందీప్‌రెడ్డి వంగా సినిమాల్లో హీరోలు విచిత్రమైన యాటిట్యూడ్‌తో కనిపిస్తుంటారు. 'అర్జున్‌రెడ్డి'లో విజయ్ దేవరకొండ, 'కబీర్‌సింగ్'లో షాహిద్‌కపూర్, 'యానిమల్'లో రణబీర్‌కపూర్ పాత్రలే అందుకు నిదర్శనాలు. ప్రస్తుతం తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' సినిమాలో పాన్ ఇండియా సూపర్‌స్టార్ అయిన ప్రభాస్‌ని సందీప్ ఎలా చూపించబోతున్నాడు?.. అనే ఊహే ప్రేక్షకులను రోమాంచితులను చేస్తున్నది. అందుతున్న సమాచారం ప్రకారం ఇందులో ప్రభాస్ పాత్ర.. విభిన్నంగా, విచిత్రంగా, మాస్ ప్రేక్షకులు మురిసిపోయేలా, సగటు ప్రేక్షకుడు సంబరపడిపోయేలా, యువతరం ఉర్రూతలూగేలా ఉంటుందట. భద్రకాళి పిక్చర్స్, టీ-సిరీస్ ఫిల్మ్స్ కలిసి నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా యాక్షన్ డ్రామా వచ్చే ఏడాది అక్టోబర్ 29న దీపావళి కానుకగా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇంటెన్స్,సైస్టెలిష్, మిస్టీరియస్ అవతారంలో ఉన్న ప్రభాస్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. బ్లాక్ క్యాప్, డార్క్ సన్ గ్లాసెస్, గడ్డంతో, రఫ్ అండ్ టఫ్‌గా క్లోజప్ ప్రొఫైల్ షాట్‌లో ప్రభాస్ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. పవర్‌ఫుల్ కథతో, క్రేజీ కాంబినేషన్‌లో రానున్న ఈ చిత్రంలో త్రిప్తి డిమ్రీ కథానాయిక. వివేక్ ఒబెరాయ్ కీలకపాత్రధారి. ప్రణయ్‌రెడ్డి వంగా, భూషణ్‌కుమార్ నిర్మాతలు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com